# 5

# కవితా గౌరవం

భర్తృమేంఠకవి చాలాకాలం క్రితం తాను ప్రారంభించిన హయగ్రీవవధ మహాకావ్యం రచన ముగించి, స్వకీయ సంకల్పానికే కాక, జీవితాని కంతటికి అప్పటికి సాఫల్యం చేకూరింది గదా అనుకుని హాయిగా నిట్టూర్చాడు. పెద్ద బరువంతా ఒక్కమారుగా దించివేసుకున్నట్టు గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అత డే దుర్ముహూర్తాన ఆ మహాకావ్యం ప్రారంభించాడో గాని, అడుగడుగునా దాని కన్ని అంతరాయాలే!

తన బాల్యంనించి ఎల్లప్పుడు ఎదురుపడుతున్న అస్తవ్యస్త పరిస్థితులన్ని క్రమక్రమంగా హరించుకు పోగలవన్న ఆశతోనే అత డాపవిత్ర గ్రంథరచన ప్రారంభించాడు. అతని ఆలోచన కొంతవరకు సముచితమే.

అది అత్యంత పునీతమయిన పురాణగాథ. హయగ్రీవుడన్న ఘోరరాక్షసు డొకడు విశ్వవిజ్ఞానరాశి అంతా నాలుగురూపాలలో మూర్తీభవించిన వేదాలు నాలుగింటిని ఆకస్మాత్తుగా అపహరించి చేజిక్కించుకున్నాడు! ఆ కల్లోల సమయంలో విష్ణుదైవతం మత్స్యావతారమెత్తి ఆ మాయావిని రూపుమాపి, తిరిగి వేదాలనన్నింటిని సముద్ధరించి లోకాని కందించాడు. అందువల్ల అది పరమేశ్వరుని విజ్ఞాన ప్రదానాత్మకమయిన పవిత్ర చరిత్ర. మహాకావ్య నిర్మాణాని కంతకన్న కోరుకోవలసిన పుణ్యగాథ ఏమి ఉన్నది?

కాని, దాని రచన కెల్లప్పుడు ఏదో ఒక అడ్డంకి ఏర్పడుతూనే

వచ్చింది. అయినా అధైర్యపడక, తన కెప్పటికయినా శుభం సమ కూరగలదన్న గట్టి నమ్మకతో, అచంచలదీక్షతో భర్తృ మేంకవి ఆ మహాకావ్యం సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది ముగించాడు.

కాని హయగ్రీవవధ రచన సమయంలో ఎదురుపడిన కష్టా లొకటొకటే తలుచుకున్న కొద్దీ అతని కెంతో నిస్పృహ కలిగింది.

భర్తృ మేంకవి తాతముత్తాతలు ధనధాన్యాదులతో నయితే నేమి, విద్యాధిక్యంవల్ల నయితే నేమి చాలా గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న సంపన్నులు. అందువల్లనే అతని నామధేయానికి మొట్టమొదట 'భర్తృ' అన్న బిరుదం వంశానుగతంగా సంక్రమిం చింది. 'భర్తృ' అంటే మహనీయుడయిన పెద్ద గృహస్థన్న మాట! కాని అతని తండ్రికాలంలోనే ఆసంపత్తి అంతా చాలావరకు కరిగిపోయింది! ఇక పట్టీ బిరుదంమాత్రమే మిగిలింది.

చిన్ననాటినించి అతన్ని ఆప్యాయంగా ఆదుకోగలిగిన వారె వ్వరు కానరాలేదు. తల్లిదండ్రు లతనికి కొంచెం ప్రాయంవచ్చిన పిమ్మటే పరలోకం చేరుకున్నారు. అయితే వారివల్ల అతని కంతగా ఆసరా లభించలేదు. అన్నలు ముగ్గురున్నారు గాని, తమతమ కుటుం బాల గొడవలలోపడి సతమతమవుతున్నవారు ఎంతకాలమని అతనికి చేయూత ఇవ్వగలరు? శ్రీనగరం సమీపంలో అగ్రహారంలో అతని కేదో కొంత భూవసతి లేకపోలేదు గాని, దానివల్ల వచ్చే లబ్ధితో అతనికి అయిదారు మాసాల గ్రాసం గడవడమే గగనమై పోతూంది. పోనీ అనుకుంటే అతనికి కలిగిన సంతానంలో ఎవ్వరు చేతికంది రాలేదు. పైగా మొదట కలిగిన ఆడపిల్లలు ముగ్గురు పెళ్ళిళ్ళ కెదిగి కూర్చున్నారు! మిగిలిన మగపిల్ల లిద్దరు ఇంకా ముక్కుపచ్చలారని పసివారే! అతని కప్పుడే నలభై అయిదేళ్ళ ప్రాయంనిండింది!

స్వతః అత డంతటి మాటకారికాడు. చొరవగా పదిమందిలోకి వెళ్ళి తనమాట నెగ్గించుకుని బయటపడలేడు. ఆపైన కొంత అంద వికారంకూడా అతని ముఖావానికి, బిడియానికి తోడయింది. రవంత వంగిన మెడతో పెద్ద ఒంటెలాగ బాగా పొడుగ్గా కనిపించే అతనికి పుట్టినప్పుడు పెట్టిన వంకరపేరు అన్నివిధాల తగినదే అని ధూర్తులు

కొందరు చాటుమాటుగా వేళాకోళం చేస్తూంటారు. అప్పుడప్పుడు ఆమాట లతని చెవినిపడి వేధించినా తనకేమీ పట్టనట్టు తప్పించుకుని తిరుగుతాడు.

అప్పుడే ముగించిన ఆ మహాకావ్యంలో కొన్ని ఘట్టాలు తిరిగి పరిశీలనగా చదువుకున్నాడు భర్తృ మేంఠకవి. కొన్ని పట్టు లతనికి అత్యద్భుతంగా ఉన్నాయని అనిపించింది. అక్కడక్కడ కొన్ని శ్లోకాలలో చిన్నచిన్న పదా లతనికి సంతృప్తికలిగించలేదు. భూర్జపత్రాలమీద హంసపాదులుపెట్టి తగిన మార్పులుచేసి, తిరిగి చదువుకున్నాడు. ఆ మహాకావ్యంవల్ల తప్పక కష్టాలన్ని గడిచి గట్టెక్కగలనని ఆనందించాడు.

అయితే ఇల్లలకగానే పండుగ కాబోదని అంతలోనే అతని కనిపించింది. ముమ్ముందుగా తా నా కావ్యం కాశ్మీరంలో వీను మిగిలిన విద్వాంసులతో, కవీశ్వరులతో నిండిన విప్రపరిషత్తు సదస్యుల సమ క్షంలో వినిపించాలి. ఆ పరిషత్తు అధ్యక్షుడు నీలకంఠమఖి మిగిలిన సభ్యులందరితోను సంప్రతించి గట్టిగా ఆమోద ముద్ర వేసినప్పుడే తన కా కావ్యం కాశ్మీరాధీశ్వరుల సమక్షంలో వినిపించే అర్హత కలుగుతుంది.

అయితే ఆ బ్రాహ్మణ పరిషత్తు అభినందన సంపాదించడం అంత తేలిక కాదు. వా రా కావ్యం కాశ్మీరాధిపతికి నివేదించడాని కేమాత్రము తగినది కాదంటే తానిక చెయ్యగలిగిన దేదిలేదు. కాని అంతటి ఉత్తమ కావ్యంలో లోపాలెన్నడానికి ఎవరికి గుండె లున్నాయి? ఒకవేళ ఎవరయినా పనికట్టుకుని దానిలో దోసగులున్నా యని ఎత్తి చూపిస్తే, తన దేవభాషా పాండిత్యంతో అవి లోటుపాట్లు కానేకావని సమర్థించుకోవచ్చును.

భర్తృ మేంఠకవి ఆలోచన లలాగ కొనసాగుతూండగానే అప్పుడే జాము రాత్రి గడిచిపోయింది. ఆనాడు మాఘశుద్ధ దశమి. తెల్లని వెన్నెల ఆకాశంలోను, శ్రీనగరంలోను అంతట అలము కుంటున్నది. ఎక్కడో దేవాలయంలో కొనసాగుతున్న నృత్యో త్సవం వీణావేణుమృదంగాల మధురధ్వనులతో మంద్రమంద్రంగా

వినవస్తున్నది. ఆకాశంలో తారకలన్నీ వెన్నెల తేటనీట జలక్రీడలతో వినోదిస్తున్నట్టు మిలమిల మెరుస్తున్నాయి. మరికొంతసేపటి వరకు రెప్పపాటయినా లేక, ఆ అపూర్వ సౌందర్యంతో తన్మయుడయినాడు కవి. అంతలోనే అతని పొరుగింట అప్పుడే నిద్రలేచిన పసిపాప పాలకోసమని గుక్కపట్టి ఏడుపు మొదలుపెట్టింది! ఆ నిసుగు తల్లి పురిటిలోనే మరణించింది. ఆ పసికందు ముత్తవ్వ చిన్న ఉద్ధరిణితో ఆ పాపనోట పాలుపోసి నెమ్మదిగా జోకొడుతున్నది. అయినా ఆ పసిగుడ్డు పాలుచాలక మరింతగా గుక్కపట్టి ఏడుస్తున్నది. తల్లిలేని ఆ పసినిసుగు దయనీయ పరిస్థితి తలుచుకోగానే భర్తృమేంఠ కవి హృదయం విపరీతమయిన వేదనతో స్తంభించింది.

ఒకవైపున వెలుగు వెల్లువలా ఉప్పొంగుతున్న వెన్నెల అపూర్వ రామణీయకం గమనించగానే అతని మనస్సొక్కమారుగా రాజహంసఅయి ఆకాశాని కెగసిపోయింది! అంతలోనే ఆ శిశువు మీదిజాలితో రెక్కలొక్కమారుగా తెగిన విహంగంలా నేలమీదకూలిపోయింది!

'అహా! ప్రపంచంలో అంతట ఉవ్వెత్తుగా ఉప్పొంగుతున్న సంతోష దుఃఖతరంగాల సవ్వడి లవలేశమయినా కవితలో ధ్వనించదుగదా! ఆ సుఖదుఃఖాలన్నీ సంపూర్ణంగా వ్యక్తీకరించగలిగిన శక్తి ఎవ్వరో ఇద్దరు ముగ్గురు మహాకవులకే తక్క వేరెవ్వరికి లభిస్తుంది? ఊరికే అంతవార మింతవారమని అహంకరిస్తే వట్టి ఆత్మవంచనమే తప్ప మరేమి మిగులుతుంది?' ఉసూరుమని నిట్టూర్చాడు భర్తృమేంఠుడు.

అయినా తన కావ్యం తిరిగి పరిశీలిస్తూంటే అతని కంతటి నిరుత్సాహం కలగలేదు. తప్పక అది విద్వత్పరిషత్తు మన్ననలందుకోగలదన్న ధైర్యం కలిగింది. అంతలోనే అతని పత్ని అపర్ణ ఆ ఆలోచనల కంతరాయం కలిగించింది.

"అప్పుడే అర్ధరాత్రి కావస్తూంది! పోనీ తెల్లవారుజామునే లేచి, తిరిగి ఆ కావ్యరచన ప్రారంభించకూడదా?"

"అప్పుడే అర్ధరాత్రి అయిందా? నే నిది గమనించనే లేదు సుమా!"

రవంత విభ్రాంత పడ్డాడు కవి.

"అవును లెండి! ఆ లోకంలోపడితే మీరింక అన్నపానాల మాటే మరిచిపోతారు!"

అపర్ణ రవంత నిష్ఠుర స్వరంతో ఎత్తి పొడిచింది. కవి తన తప్పిదం గుర్తించుకున్నాడు.

"అవును సుమా! నే నీ సంగతే గమనించలేదు!....అన్నట్టు వంటకా లేమి టీవేళ?"

"మీ కెంతో ఇష్టమయినవే" అన్నది, అపర్ణ, పెదవిపై దోబూచులాడుతున్న చిరునవ్వుతో.

"ఏమిటి చెప్మా అవి?"

ఉప్పొంగుతున్న ఉత్సాహంతో ప్రశ్నించాడు.

"మీరెరగని వేమున్నాయి? అతిశయోక్తులతో పిండివంటలు, ఉపమానాలతో పరమాన్నము, ఉత్ప్రేక్షలతో దధ్యోదనము!....ఇంకా దేవుడు మేలుచేస్తే...."

అలాగ తలవని తలంపుగా ఆమె విసిరిన ఛలోక్తి విని, రవంత నొచ్చుకున్నా కలకల నవ్వాడు కవి. ఆ పైన మరి ఆలస్యం చెయ్యక వెంటనే భోజనానికి లేచాడు.

ఇల్లాలు వ్యంగ్యంగా విసిరిన ఛలోక్తిలో ఆతని కెంతో లోతయిన అంతరార్థం స్ఫురించింది. తిరిగి లోలోపల మిక్కిలి నొచ్చుకున్నాడు. అవును! ఆమె కాపరానికి వచ్చినప్పటినించి పట్టు మని ఒక మంచి చీర కట్టుకోలేదు. ఒక్కనాడయినా తృప్తిదీరా సుష్టుగా భుజించలేదు! అయినా భూమాత ఓరిమితో, గోమాత అమాయికతతో, అడకువతో పల్లెత్తుమాటయినా అనకుండా గుట్టుగా సంసారం నెట్టుకు వస్తున్నది. ఇన్నాళ్ళ కామె కొంచెం వ్యంగ్యంగా తన అప్రయోజకత్వాన్ని గురించి ఛలోక్తి విసిరిందంటే, దానిలో ఆమె ననుకోవలిసిన పనేమి ఉన్నది? పోనీ ఇకనయినా నలుగురిలోను తా నొక ప్రయోజకు డనిపించుకుని తీరాలి?'

అదే దృఢ నిశ్చయంతో ఆ మరునాడే తన మహా కావ్యం శ్రీనగర విద్వాంసుల సమక్షంలో వినిపించి తీరాలని నిర్ణయించుకున్నాడు ఛర్త్యమేంఠ కవి. అంతలోనే అపర్ణ అందుకున్నది.

"నా వేళాకోళంతో మీ మనస్సేమయినా నొప్పించానేమో! మరోలా అనుకోకండి! అవధానుల ఇంట అప్పు తెచ్చి, పండు ద్రాక్షల రసంతో, కుంకుమపువ్వుతో గుమగుమ లాడుతున్న పాయసాన్నమే అమర్చా నీవేళ!"

తన సంతోషంకోసమని ఇల్లాలు పడుతున్న ఇబ్బందులన్ని గుర్తించగానే కవి మన స్సెంతో ఆర్ద్రమయింది. అదే సమయంలో పాయసాన్నం జ్ఞప్తికి రాగానే అతనికి పంచప్రాణాలు ఒక్కమారుగా లేచివచ్చినట్టయింది....అంతేకాదు! తన మహా కావ్యం ముగించిన నా డది అనుకోకుండా అకస్మాత్తుగా తటస్థించిన శుభశకునమే అని సంతోషించాడు. ఆ ఉత్సాహంతో అతని కా రాత్రి హాయిగా నిద్ర పట్టింది.

*　　　*　　　*

ఆ మరునాడు ఉదయమే పోయి పరిషదధ్యక్షునికి తన మహా కావ్యం సంగతి నివేదించాడు ఛర్త్యమేంఠ కవి. అత డా వార్త విని రవంత ఆశ్చర్య పడ్డాడు. ఆ కవి అంతటి మహా కావ్యం రచించాడంటే నీలకంఠమఖి కెందు చేతనో బొత్తిగా నమ్మకం కలగ లేదు!

'ఇత గాడెక్కడ? మహా కావ్య మెక్కడ? ఈ పిదప కాలంలో ఎందుకు కొరగాని వ్యర్థులందరు మహా కావ్య రచన లారంభిస్తున్నారులా ఉంది?' అని అంతర్యంలో నవ్వుకున్నాడు. కాని పైపైకి మాత్రం మర్యాదగానే సమాధానం చెప్పాడు.

"మీరేదో అంతటి మహా కావ్యం రచించి, దాని స్వారస్యామృతం మాకందరికి ఉచితంగా పంచిపెడతా మంటే చేదా ఏమిటి?"

అంటీ అంటనట్టు నీళ్ళు నమిలాడు.

ఆనాటి మధ్యాహ్నం కొంచెం పొద్దువాలిన పిమ్మట హయగ్రీవ వధ మహా కావ్య గోష్ఠి ప్రారంభ మయింది. ఛర్త్యమేంఠ కవి

అనాకారితనంతో బాటు, అతని గొంతుకూడా అంతశ్రావ్య మయినది కాదు. కాని దానిలో రవంత గాంభీర్యం లేకపోలేదు. అందులోను కవి తానే రచించిన కావ్యం వినిపిస్తున్నందువల్ల ఎక్కడి కక్కడికి స్పష్టంగా అర్థం అయ్యేటట్టు కొంచెం గొంతెత్తి చదవడం ప్రారంభించాడు. మరి కొంత సేపటికి కతని కావ్యపఠనం ముగిసింది.

అంతవరకు నీలకంఠ మఖి పెదవి కదపలేదు. సదస్యులలో కొందరు అప్పుడప్పుడు చిన్నచిన్న శిరః కంపాలతో అభినందించారు. అంతే!

అయినా భర్తృమేంఠ కవి సభాస్తారు లందరివైపు జిజ్ఞాసార్థకంగా చూశాడు. వారిలో శంకరభట్టారకుడన్న అలంకార శాస్త్ర విద్వాంసుడు నెమ్మదిగా లేచినిలుచున్నాడు.

"హయగ్రీవవధ మహాకావ్యాల కోవలోనిదే: సందేహం లేదు. దీనిలో ఆయా వర్ణనలన్నీ ఉన్నాయి....తత్రాపి వీరరస ప్రధాన మయిన ఇంతటి మహా కావ్యం రచించడం మాటలతో పని కాదు. ఇది సంస్కృత కవితా సరస్వతి కొక సువర్ణాలంకారమే! ....అయితే శైలి మాత్రం క్లిష్టంగా, కొన్నిచోట్ల కటువుగా వినిపిస్తున్నది."

"నా కంతటి శైలీ కాఠిన్యం గోచరించలేదే!"

అన్నా డింకొొక వ్యాకరణ శాస్త్ర విద్వాంసు డంతలోనే లేచి నిలిచి.

"అయితే కొన్ని పాణినీయ విరుద్ధ ప్రయోగాలు లేక పోలేదు."

తిరిగి తన శాస్త్ర పాండిత్యం ప్రకటించుకున్నాడు.

విధుమౌళి అన్న వేరొక తర్కపండితు డంతలోనే తన విమర్శ వెలిబుచ్చాడు.

"సరే! ఈ శైలీ చర్చ కేమిగాని, నా కీ కావ్యం పేరే సమంజసంగా లేదు! హయగ్రీవు లన్న నామధేయంతో సర్వజ్ఞులయిన దైవతం వేరొకరు ఉండడంవల్ల, ఆయన సంహారమే దేని తాత్పర్య

మేమో అన్న భ్రాంతి కలగవచ్చును. కనక దీనికి వేరొక పేరు పెట్టడం మంచిదని నా అభిప్రాయం....''

''పేరు విన్నంతలోనే భ్రమపడే ఉంతటి అజ్ఞు లెవ్వరు లేరయ్యా ఇక్కడ! నాపట్టుకి నా కిదే బాగుంది!''

శివంకర భట్టన్న ఒక కవి లేచి, ఆవేశంతో అల్లల్లాడిపోతూ విధుమౌళిని తూర్పార బట్టాడు.

''వ్యంగ్య వైభవంతో ఒప్పారుతున్న వీరరసమే కాదా ఈ కావ్య ప్రాణం! అందువల్ల ఆ విషయమైన చర్చ అత్యంత ముఖ్య మని నా అభిప్రాయం!''

నీలకంఠమఖి నెమ్మదిగా లేచి, ఆ వాదోపవాదా లింకొక వైపు మళ్ళించాడు.

దానికి సంబంధించిన చర్చలో పాల్గొన్నవారందరు మొత్తం మీద శృంగారరసం ఉపాంగంగా వీరరస పోషణ బాగానే కొన సాగినట్టు అతి కష్టం మీద అంగీకరించారు! అయితే కొన్నికొన్ని ఘట్టాలలో వ్యంగ్యం మరింతగా విగూఢమై కొరకరాని కొయ్యగా పరిణమించిందని తమ అరుచి వ్యక్తీకరించారు. ఇంకొక కవి లేచి శృంగారరసం ప్రధానమై ఉంటే ఆ కావ్యం మరింత బాగుండే దని వివరించి, వీరరస పోషణ జరగవలసినంత గొప్పగా జరగ లేదని చప్పరించి వేశాడు. ఇంకొక విద్వత్కవి ప్రధానమయిన వీరరసానికి, శృంగార రసానికి అంగాంగీ భావం తిన్నగా కుదర లేదేమో అని తన సంశయం మాత్రమే వ్యక్తీకరించాడు. చిట్ట చివరికి నరకేసరి అన్న ఒకే ఒక వృద్ధకవి లేచి నిలిచి, అది సర్వాంగ సుందరమయిన మహా కావ్యమని మనసారా అభినం దించాడు. కాశ్మీరాధీశ్వరుల పరిశీలన కది తప్పక నివేదించి తీర వలసినదే అని నిస్సందేహంగా తన నిర్ణయం బయటపెట్టాడు. అయితే ఆ సదస్యులలో వేరొక రెవ్వరు అతనితో ఏకీభవిస్తున్నట్టు కానరాలేదు!

భర్తృమేంఠ కవికి వారి ప్రసంగా లాలకిస్తూంటే తల తిరిగి పోతున్నట్టనిపించింది. అందరు కేవలం తమ తమ దృక్ప

ఖాలతోనే విమర్శించారు కాని, ఒక్కరు తన కావ్య లక్ష్యమేమో, దాని పరమార్థ మేమో ఆవంతయినా గుర్తించినట్టు కానరాలేదని ఎంతో నిరుత్సాహపడ్డాడు. అయినా నీలకంఠ మఖి తుది తీర్పు కోసం నిశ్చల దృష్టితో నిరీక్షించాడు.

అంతలోనే అతడు భుజం మీదినించి తొలగిన ఉత్తరీయం సవరించుకుంటూ లేచి నిలుచున్నాడు.

"భర్తృ మేంఠకవీశ్వరుల మహాకావ్యం సర్వాంగసుందర మయినదే....కాని..."

ఆ మాటతో కవికి నోరెండిపోతున్న ట్టనిపించింది. అయినా ఊపిరి బిగబట్టుకుని అలాగే నిరీక్షించాడు. నీలకంఠమఖి తిరిగి ప్రారంభించాడు.

"సదస్యుల సదుపదేశాల ప్రకారం హయగ్రీవవధ మహాకావ్యంలో అక్కడక్కడ కొన్ని చిన్న మార్పులుచేసి, తిరిగి ఇంకొక్కమారు పరిషత్తు సమక్షంలో నివేదించడం మంచిదని...."

కవి మరి భరించలేకపోయాడు! ఒక్కమారుగా కస్సుమన్నాడు. "నేనెవ్వరి సదుపదేశాలు శిరసావహించ దలుచుకోలేదు! ప్రభువుల సమక్షంలో నా మహాకావ్యం నివేదించడానికి తామంగీకరిస్తే సరే సరి! లేకపోతే నేనే స్వయంగా పోయి వారి దర్శనం చేసుకుంటాను!"

"పరిషదధ్యక్షుల అంగీకారం లేనిదే నీవెలాగ వారిని సందర్శిస్తావయ్యా! ఇది కేవలం ప్రభువర్యుల ఆజ్ఞ కాదని తిరస్కరించడమే!"

తర్కవిద్వాంసుడు విధుమౌళి తటాలున లేచి నిలిచి, తన అక్కసు వెళ్ళగక్కుకున్నాడు!

"అయితే మీ అందరివల్ల నాకు ఘోర దురన్యాయం జరిగిందని వెల్లడించి, తిన్నగాపోయి ప్రభువుల భవంతి ప్రాంగణంలోనే ప్రాయోపవేశం ప్రారంభిస్తాను!"

మరింత మంకుపట్టుదలతో తన దృఢనిశ్చయం వెలువరించాడు కవి.

"ఒక్క బ్రాహ్మణ పరిషత్తు తక్క వేరొక రెవ్వరు కాశ్మీరంలో ప్రాయోపవేశం ప్రారంభించరాదు! ఈ కట్టడి అతిక్రమించడానికి నీకర్హత ఎక్కడిది?"

మరింతగా గొంతెత్తి మండిపడ్డాడు విధుమౌళి.

"అయినా సరే. నే నా నియమం పాటించ దలుచుకొనప్పుడు నన్నెవ్వరడ్డగించగలరు? ఏది ఏమయినా సరే. నానిశ్చయాని కిక తిరుగులేదు!"

పట్టరాని ఆవేశంతో గజగజ వణికిపోయాడు భర్తృ మేంఠకవి.

అదే సమయంలో నీలకంఠ మఖి తటాలున లేచి నిలుచున్నాడు. చెయ్యెత్తి వాదోపవాదాలంతటితో ముగించవలిసిందని హెచ్చరించాడు.

"చిట్టచివరి కీ వ్యవహారంలో అంతిమ నిర్ణయం నాదే కదా! అనవసరంగా మీకెందు కీకంఠశోష? ఈ పరిస్థితిలో అందరికి అంగీకార యోగ్యంకాగల మార్గమొకటి స్ఫురిస్తున్నది. ఇక్కడ సదస్యులందరు వెల్లడించిన అభిప్రాయాలన్ని విపులంగా వివరించి. ఈ మహాకావ్యం మన ఏలికసమక్షానికి నివేదించవచ్చును....అంతేకాదు. కవి ప్రాయోపవేశం ప్రారంభించగలమని హెచ్చరించిన విషయం కూడా వారికి విన్నవించవచ్చును. ఇది అందరికి అనుకూలమయిన సామరస్య మార్గం కాగలదని నానిశ్చయము....దీని కంగీకరించవలిసినదని నాప్రార్థన."

అతని సామరస్య పద్ధతి ఎవ్వరుకాదనలేకపోయారు. కాని దానిలో ఏదో పెద్దమెలిక ఉన్నదని కొందర నుకున్నారు. అందువల్ల భర్తృ మేంఠకవికి చిట్టచివరికి దేవిడీమన్నా జరగగలదని కూడా వారూహించుకున్నారు.

ఆ నిర్ణయం తనకెంతో అసంతృప్తి కలిగించినా పోనీ ఆ తీరులో నయినా కాశ్మీర ప్రభువర్యుల సాన్నిధ్యంలో తన మహాకావ్యం వినిపించగల సదవకాశం లభించగలదని భావించి కవి దాని

కంగీకరించాడు. మరికొన్ని క్షణాలలోనే విద్వత్పరిషత్తు సమావేశం ముగిసింది.

* * *

ఆనాటి పండిత పరిషత్తులో జరిగిన వాదోపవాదాల తీరు తలుచుకున్న కొద్దీ భర్తృమేంఠ కవికి పట్టరానంత ఆవేశము, ఆశ్చర్యము, అక్కసు కలిగాయి! అంత మంది విద్వాంసులలో, కవీశ్వరులలో ఒక్క వృద్ధకవి నరకేసరి మాత్రమే తన కావ్యం ప్రశస్తమని ప్రశంసించారు!

ఇక మిగిలిన వారందరు తన కవితలో ఏదోవిధంగా ఏవేవో దోసగులెత్తి చూపించినవారే! హయగ్రీవ వధలో చిన్నచిన్న లోటుపాట్లు కొన్ని అతని కెరుకపడక పోలేదు. అవి అంగీకరించి, మిగిలినవి సమర్థించుకోవలెనని అత డనుకున్నాడు.ఆ పైన పరిషత్సదస్యులు తన మహాకావ్యం తప్పక ఆమోదించి, మహారాజ సమక్షానికి నివేదించగలరని భావించాడు. అంతేగాని పని కట్టుకుని చిన్న చిన్న తప్పిదాలే వెయ్యెత్తి చూపించి, దుమ్మెత్తి పొయ్యగలరని ఊహించ లేదు. పట్టరాని ఈర్ష్యాసూయలతో వారాదోసగులన్నీ గోరంతలు కొండంతలుచేసి, అధిక్షేపించి, మొదటికే ముప్పు తేగలరని ఏ మాత్రము ఎదురుచూడలేదు. 'ఆహా, విద్వాంసులలోనే ఒక్కొక్కప్పుడు ఎంతటి అసహనం గూడుకట్టుకుంటుంది! వనిత ఎంతటి శీలవతి అయినా,కవిత ఎంతగా నిర్దుష్టమయినా ఏదో వంకపెట్టి లోకం వేలెత్తి నిందించగలరన్న లోకోక్తి ఊరికే బయలుదేరుతుందా?' అని రవంత ఆశ్చర్యపడ్డాడు.

ఇక అతనికి, ఆనాటి కాశ్మీర మహీపతి కొలువుకూటంలోనే న్యాయం చేకూరవచ్చునని అనిపించింది. కవి ఆ తీరులో ఆశించ దానికి కొంత ఆధారం లేకపోలేదు. అప్పటి కాశ్మీరమహారాజు మాతృగుప్తుడు స్వయంగా కవి. అదీగాక అత డాగర్భశ్రీమంతుడు కాడు. చిన్ననాటినించి ఎడతెగని లేమితో సతమతమయిన నిరుపేద బ్రాహ్మణుడు. అనేక రాజాస్థానాలు సందర్శించి, ఎక్కడ తగినంత ఆదరం లభించక, చిట్టచివరకి ఉజ్జయినిలో భారతచక్రవర్తి హర్ష

విక్రమాదిత్యుని ప్రాపకం సంపాదించుకున్నాడు. క్రమక్రమంగా కేవలం తన కవనంతోనేకాక, అనేక రాజకార్యాల నిర్వహణతోకూడా సర్వసమర్థుడని చక్రవర్తి మన్నన అందుకున్నాడు. అంతకు మునుపే కాశ్మీరం హర్ష విక్రమాదిత్యునికి లోబడిన సామంత రాజ్యమయింది.

ఆ సమయంలో అనేకమయిన అల్లకల్లోలా లేర్పడినందువల్ల కాశ్మీర సింహాసనానికి సమర్థుడయిన వారసు డెవ్వడు కానరాని పెద్ద కొరతఏర్పడింది.అది గమనించి విక్రమాదిత్యచక్రవర్తి మాతృగుప్తుని కా రాజ్యం సగౌరవంగా బహూకరించాడు. అప్పటినించి అనన్య సామాన్యమయిన పరాక్రమంతో, శక్తిసామర్థ్యాలతో కాశ్మీరం పరిపాలిస్తూ మాతృగుప్త కవి హర్ష విక్రమాదిత్యునికే మహాశ్చర్యం కలిగించాడు.

అటువంటి వ్యక్తి తన కావ్యం శ్రద్ధగా ఆలకించి న్యాయం ప్రసాదించరా? భర్తృమేంఠ కవికి కొంత ఆశ కలగకపోలేదు. అయితే చిట్టచివరికి అదృష్టదేవత తన్నేవిధంగా అనుగ్రహించగలదో అన్న మథన అతని ననుక్షణం వేధించింది.

ఒకవేళ కాశ్మీరాధీశ్వరులు బ్రాహ్మణ పరిషత్తుతో ఏకీభవించి తన కావ్యంలో దొసగులున్నాయని నిరాకరిస్తే? విద్వత్పరిషత్తు తీర్పు సరికాదని ఎదిరించి, ప్రాయోపవేశం ప్రారంభించగలనని బెదిరించి మహారాజదర్శనం కోరినందువల్ల తన కిక నలుగురిలోను పెద్ద తల వంపే తటస్థించగలదు! అంతేకాదు! శ్రీనగరంలో తా నింక తల ఎత్తుకుని తిరగగలడా? ఆ విధంగా మథనపడిన భర్తృమేంఠ కవి 'సరే, కానున్న దేదో కాకమాన' దని గుండె రాయి చేసుకున్నాడు.

నాలుగయిదురోజు లలాగ సాగిపోయాయి. ఆపైన ఒకనాడకస్మాత్తుగా నీలకంఠమఖి స్వయంగా భర్తృమేంఠకవి గృహానికి విజయం చేశాడు. ఆనాటిరాత్రే కాశ్మీరాధిపతి హయగ్రీవవధ కావ్యం విద్వత్పరిషత్తు సమక్షంలో వినగోరుతున్నారని ఆయన అభిలాష తెలియజేశాడు. ఆ పరిషత్తు తన కావ్యాన్ని గురించి ఏకగ్రీవంగా సదభిప్రాయం వెల్లడించకపోయినందువల్ల, మాతృగుప్తు లొకవేళ

దర్శనమే కటాక్షించరేమో అని భర్తృమేంఠకవి ఎంతయినా గుంజా టన పడ్డాడు. కాని నీలకంఠమఖి అందించిన శుభవార్త విని, పోనీ ఆ అడ్డంకి తొలగిపోయిందిగదా అని సంతోషించాడు.

ఆనాటిరాత్రి తళతళ మెరుస్తున్న కాచగోళాల దీపికలకాంతిలో మాతృగుప్త మహేశ్వరుని కొంకింత వెనకవైపున నిలిచి వింజామర లలవోకగా వీస్తున్న చామరగ్రాహిణుల కరకంకణాల కలకల ధ్వనంలో హయగ్రీవవధ మహాకావ్య పరిశీలనగోష్ఠి ప్రారంభ మయింది. కాశ్మీరాధీశ్వరుని కుడివైపున భర్తృమేంఠకవి. ఎడమ వైపున విప్రపరిషత్తు పెద్ద నీలకంఠమఖి తమ కేర్పరచిన సముచిత సుఖాసనాలలో సమాసీనులయినారు. మాతృగుప్త మహీజాని నీల కంఠమఖికి, కవికి ప్రత్యేకించి స్వయంగా కర్పూర తాంబూలాలు రెండేసి సమర్పించి తా నొకటి పుక్కిట పెట్టుకున్నాడు. సభాస్తారు లొక్కొక్కరికి పరిచారికల ద్వారా అయా మన్ననలు, మర్యాదలు సరిగా జరుగుతున్నది. లేనిది ఒక కంట జాగ్రత్తగా పరిశీ లించాడు.

ఆపైన సరస ప్రసంగంతో మరికొంతసేపు ఇష్టాగోష్ఠి కొన సాగించి, ఆ మహాకావ్యం వినిపించవలసినదని కవిని సగౌరవంగా వేడుకున్నాడు. ఆ అపూర్వ గౌరవం గమనించగానే భర్తృమేంఠుని కెంతయినా ఉత్సాహం కలిగింది. తిరిగి జీవచైతన్యమే శరీరంలో నుండి విజృంభిస్తున్నట్లనిపించింది! కాని సభాస్తారులు మాత్రం దాని కంతగా ఆశ్చర్యపడలేదు. 'ఈ మహారాజమర్యాదల కంత ఉబ్బి తబ్బిబ్బయిపోవలసినదేమి ఉన్నది?' అని తమలో తాము సమా ధాన పడ్డారు.

కవి రవంత గొంతెత్తి హయగ్రీవవధపఠనం ప్రారంభించాడు. క్రమక్రమంగా అతని గొంతులో గాంభీర్యం హెచ్చింది. మొత్తం కావ్యంలో ఇంచుమించుగా మొదటి ఖండం ముగిసింది. కవి సభా సదులపై పొకమారు చూచి, తిరిగి ఆ మహాకావ్యం ప్రారంభించాడు. అలాగలాగ రెండుమూడు గడియలకాలం గడిచింది. కాని, అంత వరకు మాతృగుప్తుడు కాని, మిగిలిన సదస్యులుగాని ఆవంతయినా

అభినందించడం జరగలేదు: కాశ్మీరాధిపతి పెదవులపై విశ్చలమై నిలిచిన చిరునగవు మాత్రమే గమనించినందువల్ల సభ్యు లావిధంగా తటస్థులై ఉండవచ్చునని భర్తృమేంఠకవి భావించుకున్నాడు.

క్రమక్రమంగా ఆ మహాకావ్యం ముగిసిపోవచ్చింది. అయినా సదస్యులలో ఎక్కడా సంచలనం కనిపించలేదు: మరికొంతసేపటికా కావ్యపఠనం పరిసమాప్తమయింది. అయినా మాతృగుప్తునితోబాటు, సదస్యులందరు తమ కేమీ పట్టనట్టు తటస్థులుగా ఉన్నట్టు గమనించిన కవికి భరించరానంత నైరాశ్యం కలిగింది. తన గ్రంథం తిరిగి పసుపుతాళ్ళతో బిగించి, కొంచెం దురుసుగా వ్యాసపీఠంమీదికి విసిరి వేశాడు. అయితే తటాలున అది దాని పక్కన పడింది. అంతలోనే మాతృగుప్త దది అందుకుని పైడి పద్మాలతో రూపొందించిన తన వ్యాస పీఠంపై ఉంచుకుని వికసిస్తున్న చిరునగవుతో రవంతసేపు పత్రాలు కొన్ని పరిశీలించి, తిరిగి సగౌరవంగా కవి చేతి కందించాడు....

అంతేగాని ఉలకలేదు; పలకలేదు: అతని ముఖపై ఖరి మిక్కిలి జాగరూకతతో పరిశీలించాడు భర్తృమేంఠకవి. ఎక్కడ ఏవిధమయిన అభిప్రాయచ్ఛాయ పొడకట్టలేదు: అయితే ఎడతెగని చిరునవ్వు అదే విధంగా తరళించింది. అంతే!

భర్తృమేంఠకవి కొక్కమారుగా నవనాడులు కుంగిపోతున్న ట్టనిపించింది. అలాగ ఎంతసేపని నిరీక్షించగలడు? కాశ్మీరాధిపతి పద్ద, నీలకంఠమఖివద్ద అలతి నగవుతో, అత్యంతవినయంతో సెలవు తీసుకున్నాడు.

మరికొన్ని క్షణాలలోనే మాతృగుప్త మహీపతి ఆనాటి కొలువు చాలించినట్టు సూచిస్తూ నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. మహా రాజమర్యాద ప్రకారం సదస్యులందరు వెనువెంటనే సగౌరవంగా లేచి నిలుచున్నారు. కాశ్మీర మహీపతి అక్కడినించి కదిలి అభ్యంతర మందిరంలోనికి తరలిపోగానే సదస్యులందరు వినబడీ వినబడని గుసగుసలతో నెమ్మది నెమ్మదిగా నిష్క్రమించారు.

కవికి ప్రపంచంలో తానొక్కడే మిగిలిపోయినట్టనిపించింది:

పేరనంగా కాళ్ళీడ్చుకుంటూ తన ఇంటివైపు సాగిపోయాడు. విద్వత్పరిషత్తులోగల పండిత ప్రకాండు లందరు తనవంటి దురహంకారికి తగిన శాస్తి జరిగిందని గుసగుసలాడుకుంటున్నారని ఊహించుకోగానే అతని హృదయం శతధా విదీర్ణమయింది. 'నా కింక కాశ్మీర రాజధానితో ఋణం తీరిపోయినట్టే!' అనుకుని ఉసూరుమని నిశ్వసించాడు. అయితే చిన్ననాటినించి ఎడతెగని కష్టా లనుభవించి నందువల్ల అతని గుండె దిటవు మాత్రం చెక్కుచెదరలేదు.

నట్టింట అడుగు పెట్టగానే అపర్ణ అతని ముఖ కవళిక గమనించి పెద్ద బెడద ఏదో విరుచుకు పడి ఉండవచ్చునని అనుమానించింది. అప్పు డా మాట ప్రస్తావించడం మంచిదికాదనుకుని, వేళ మించిపోతున్నందువల్ల వెంటనే భోజనానికి లేవవలసిందని వేడుకున్నది. వంటఇంటిలోపలికి పోయి వడ్డన ప్రారంభించింది.

అతడు లోపలికిపోయి, భోజనం ప్రారంభించి, బాగా స్తిమిత పడిన పిమ్మట నెయ్యి వడ్డిస్తూ నెమ్మదిగా అడిగింది.

"అలాగున్నా రే మండీ!....ఇంతకి ఏమయినట్టు మీ మహా కావ్యం వ్యవహారం?"

"ఆ! కావడాని కేమి ఉందిలే! ఆ విద్వద్వరేణ్యులతో మహారాజు పూర్తిగా ఏకీభవించినట్టున్నారు! అలాగని, ఆయన అవునని కాని, కాదని కాని ఏ మాట తిన్నగా తేల్చి చెప్పలేదు....ఇక మిగిలిన పెద్ద లందరు అదే విధంగా మూగ నోములు పట్టి మూతులు బిగించుకుని కూర్చున్నారు!"

అపర్ణ రవంత సే పాలోచించి, అలతి నగవుతో తన ఆలోచన బయటపెట్టింది.

"వా రొక వేళ తమ తుది తీర్పు నెమ్మదిగా తెలియ జెయ్యవచ్చునని ఆలోచించుకున్నారేమో!"

"ఇంతమాత్రానికి అంతటి పెద్ద ఆలోచన ఎందుకు? హయగ్రీవ వధ అంత సే పాలకించిన పిమ్మట, అను మో, మిను మో ఆ సదస్యు లందరి సమక్షంలోనే తేల్చి చెప్పవచ్చును గదా!...ఒకవేళ కావ్యం తమ కేమాత్రము రుచించలేదని నీలకంఠ ముఖద్వారా వర్త

మానం పంపించ దలుచుకున్నారేమో!....ఆ మౌనానికి అంతకన్న వేరే కారణం ఏమి ఉంటుంది?....ఆ మాట అక్కడే వెల్లడిస్తే పోయేదిగా!....నా మథన అంతా ఇంతే!....

"ఏలిన వా రొకవేళ శుభ వర్తమానమే మీకందించాలని ఆలోచిస్తున్నారేమో!"

కిలకిల నవ్వాడు కవి.

"ఏదో సామ్యం చెప్పినట్టుంది నీ మాట! కొంగు పట్టుకుని లాగితే రాని రమణీమణి కన్ను గీటితే వస్తుందా? శుభ వర్త మానమే అందించే మాట ఉంటే అప్పుడే రవంత సూచించవచ్చును గదా!...."

"అభిమానవతి అయితే కొంగు పట్టుకుని లాగి మోట సరసం చేస్తే రానేరాదు! సన్నగా కన్ను గీటితేనే వస్తుంది!"

చమత్కరించి లీలగా నవ్వింది అపర్ణ. ఆమె మాటకారి తనానికెంతయినా మురిసిపోయాడు కవి. తన కుల్లాసం కలిగించ డానికే ఆమె అలాగ చమత్కరించిందని గ్రహించుకుని పట్టరాని ఆత్మీయతతో, ఆర్ద్రతతో అపకుడయినాడు! ఆపైన అత డా కావ్యం మాటే తలపెట్టలేదు!

మరునాడు బాగా తెల్లవారిన పిమ్మట నీలకంఠ మఖి తన ఇంటిపైపు వస్తూండడం గమనించి, చావు కబురు చల్లగా చేరవెయ్య డానికే అతని రాక అని నిర్ణయించుకున్నాడు.

కాని ఆతిథ్య మర్యాద పూర్తిగా ముగియకుండానే హయ గ్రీవవధ మాతృగుప్త ప్రభువుల హృదయమే చూరగొన్నదని వెల్లడించి, చేతులు రెండు పట్టుకుని మనసారా అభినందించాడు నీలకంఠ మఖి!

"నన్నుగాని వేళాకోళం చెయ్యడంలేదు గదా! అసలే కుంగి పోయిన నావంటి వాణ్ణి అపహాసిస్తే మీ ఒళ్ళో ఒరిగే దేమిటి?"

కవి నిలువునా నిర్ఘాంతపడి, రవంత నిష్ఠుర స్వరంతోనే ప్రశ్నించాడు.

"కాదు! కాదు! మీరు బొత్తిగా పొరబడు తున్నారు! మాతృ

గుప్త మహీశ్వరులు మీ మహా కావ్యం లోతుగా అవగాహన చేసుకుని, మహానంద భరితులయినారు!....ఈ సాయంకాలమే ఆ మహా కావ్యం బంగారు పల్లకిలో ఊరేగించి, దానితోబాటు మీ దంపతుల కఖండ సత్కారం జరిపించ వలెనని వా రాత్రపడుతున్నారు! ఆ శుభ వర్తమానం నా ముఖతః మీ కెరిగిస్తున్నారు! ఇది అక్షరాలా యథార్థమే! నా మాట నమ్మండి!"

"అయితే నిన్న రాత్రి ఇటువంటి భావం వారి ముఖంలో అణువంతయినా వ్యక్తం కాలేదే!"

మరింతగా నిర్ఘాంత పడ్డాడు కవి. తిరిగి వివరించాడు నీల కంఠ మఖి.

"మీరది పసికట్టలేక పోయారుగాని, నేనది చాలావరకు ఆకట్టుకున్నాను."

"ఎలాగ గ్రహించగలిగారు?"

మరింత ఆశ్చర్యపడి ప్రశ్నించాడు కవి.

"మీ రా మహా కావ్యం రవంత విసుగుదలతో వ్యాస పీఠం మీదికి విసిరినంతలోనే వా రది పైకెత్తి, తమ ఎదట బంగారు వ్యాస పీఠంలో ఉంచుకుని జాగ్రత్తగా మలిపి సౌందర్యం పరిశీలించారు! తిరిగి సగౌరవంగా మీ కందించారు! అప్పుడే వారి ఆంతర్యం లోతు గ్రహించుకున్నాను."

తాను వింటున్నది విశ్వసించకలేక, నోట మాటలేక అలాగే విస్తుపోయాడు భర్తృమేంఠ కవి. తిరిగి అందుకున్నాడు నీలకంఠ మఖి.

"ప్రభువులు సాగరగంభీరులు! సహృదయతా ఖనులు! తమ ఆంతర్యం లేశమయినా పైకి తొణకనియ్యరు! నేనే వారి భావం లోతు గ్రహించుకోలేక పోయానంటే మీరు పొరబడితే ఆశ్చర్య మేమిటి?....ఇంకొక్కమాట! మీ మహా కావ్యంలో వ్యంగ్యం వెల్లివిరిసింది కదా! అదేవిధంగా తమ గౌరవభావం వారు మీకు వ్యక్తీక

రించారు! అయితే విపరీత మయిన తహతహవల్లనే మీరది ఆకళించు కోలేక పోయారు! అంతే!"

అప్పటికి భర్తృ మేంఠుని కంఠా మంచువిడిపోయినట్టు స్పష్టపడింది. మాతృగుప్త మహీనాథుని లోతయిన సహృదయత, అర్ద్రిత, కవితాగౌరవము గ్రహించుకున్న అతని చెక్కిళ్ళు రెండు ఆనంద బాష్పాలతో తరళించాయి.

"నేను కవిత్వం వల్లనే కవి నయినాను! కాని కాశ్మీరాధీశ్వరులు తమ కవిత్వం వల్లనే కాక, అత్యద్భుతరసజ్ఞతతో, ఔదార్యంతో, కవితా గౌరవంతో మహనీయ కవీశ్వరులనే అధఃకరించి వేశారు!"

గద్గద స్వరంతో తన కృతజ్ఞత వెల్లడించుకున్నాడు భర్తృ మేంఠ కవి.

నీలకంఠ మఖి సగౌరవంగా పీద్కొన్న పిమ్మట అపర్ణ కా శుభవార్త తెలియజేసి, తన లోకజ్ఞత కన్న ఆమె లోకజ్ఞతే గొప్పదని అభినందించాడు భర్తృ మేంఠుడు.

కవి దంపతులతోబాటు హయగ్రీవవధ మహాకావ్యానికి ఆనాటి సంజవేళ అఖండ సత్కారం జరిగినదని వేరుగా వివరించ నక్కర లేదు గదా!

———